క్లుప్తంగా

పెడన మున్సిపల్ కమిషనర్‌గా మహేంద్ర



పెడన: పెడన మున్సిపల్ కమిషనర్‌గా బి. మహేంద్రను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. అంజయ్యను సీడీఎంఏ కార్యాలయంలో తదుపరి పోస్టింగ్ కోసం రిపోర్టు చేయాలని పేర్కొంది. ప్రస్తుతం మహేంద్ర ఏలూరు కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఒన్‌పే స్కేల్‌పై ఈయన పెడన పురపాలక సంఘానికి కమిషనర్‌గా రానున్నారు. ఈయన శుక్రవారం లేదా శనివారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది. అంజయ్య 2020 అక్టోబర్ 12న పెడన మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవలి కాలంలో అత్యధికంగా పనిచేసిన కమిషనర్‌గా అంజయ్య గుర్తింపు పొందారు.

బందరు అసిస్టెంట్ కమిషనర్ అనూష బదిలీ

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ కె. అనూష బదిలీ అయ్యారు. మునిసిపల్ పరిపాలన శాఖ, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వై. శ్రీలక్ష్మీ బుధవారం రాష్ట్రంలోని పలు మునిసిపాలిటీల కమిషనర్లను బదిలీ చేస్తూ.. కొత్త వారిని నియమిస్తూ జీఓను జారీ చేశారు. ఈ జీఓ ప్రకారం అసిస్టెంట్ కమిషనర్ అనూష తెనాలి మునిసిపాలిటీకి ఇదే హోదాలో బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.

ఘనంగా నాగుల్ మీరా జెండా పండుగ



నాగాయలంక: నాగుల్ మీరా జెండా పండుగ గురువారం స్థానిక కృష్ణానది తీరంలోని మత్స్యకార భవనం ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సీజన్‌లో తమ చేపల వేట ఆశాజనకంగా సాగి పిల్లాపాపలు సుసంపన్నంగా జీవించాలని కోరుకుంటూ సంప్రదాయ వేడుకగా జరిపే ఈ పండుగలో స్థానిక రేవు మత్స్యకారులు తొలుత నాగుల్ మీరా జెండా స్థూపాన్ని ఆవిష్కరించారు. అనంతరం వేటకు వెళ్లే మత్స్యకారులు, మహిళలు పూజలు చేశారు. తొలుత జెండా స్తంభానికి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దాతలు నడకుదిటి నాగాంజనేయులు, శివసుబ్రహ్మణ్యం ఆర్థిక సౌజన్యంతో అన్నసమారాధన నిర్వహించారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, మత్స్యకార సంఘాల నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి, రేవు సువర్ణరాజు, ఎంపీటీసీ సభ్యులు లంకె శ్రీనివాస ప్రసాద్, నాగిడి ఆదిలక్ష్మి పాల్గొన్నారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

పెడన: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవని చేవేంద్ర ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి. వరప్రసాదబాబు అన్నారు. జాతీయ మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఉప్పలకలువగుంట గ్రామంలో మలేరియా నివారణ చర్యలు..ముందస్తు జాగ్రత్తలపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు పెరుగుతాయని, ఇవి మలేరియా, డెంగీ వంటి వ్యాధులను వ్యాప్తి చేస్తాయని చెప్పారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పరిసరాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించవచ్చన్నారు. ఎంపీహెచ్‌ఓ ఎస్. మోహనరావు, కె. ఉమామహేశ్వరరావు, ఎం. నాగదేవి పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

మచిలీపట్నంటౌన్: నగరంలోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 25వ రోజు 32 మంది విద్యార్థులు హాజరుకాగా వీరికి భగవద్గీతలోని 13వ అధ్యాయం 20వ శ్లోకం నేర్పించి తాత్పర్యాన్ని ఉపాధ్యాయిని ఎం. విజయ వివరించారు. సరస్వతి ప్రార్థన అనంతరం కథలు, పుస్తకాలు చదివించి ఆటలు ఆడించి లెక్కల్లో మెలకువలను నేర్పించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వై. జయలక్ష్మీ పిల్లలకు కోలాటం నేర్పించారు. అల్పాహారం అందించారు. అలాగే చిలకలపూడిలోని శాఖ గ్రంథాలయంలో విద్యార్థులతో పేపర్ క్రాఫ్ట్ బొమ్మలను తయారు చేయించారు. పలు ఆకృతుల్లో తయారు చేసిన ఈ బొమ్మలు ఆకర్షణీయంగా ఉన్నాయి. ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో డ్రాయింగ్, దక్షిణామూర్తి, దత్తస్తవం శ్లోకాలు నేర్పించారు. మురళీకోలాటం, యోగా, ధ్యానం నేర్పించారు. జిల్లా ఉప గ్రంథాలయాధికారి ఎం వీడీటీ నగేష్, చిలకలపూడి, ఈడేపల్లి శాఖ గ్రంథాలయాల పాలకులు పర్యవేక్షించారు.

ఐదెకరాల గడ్డివామి దగ్ధం

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల మండలం దాలిపర్రులో కొండేటి శ్రీనుకు చెందిన ఐదెకరాల వరి గడ్డి వామి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. మొవ్వ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.30 వేల మేర ఆస్తినష్టం జరిగింది.

జగన్ పాలనలో పేదలకు విస్తృత ప్రయోజనాలు

- కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు, ఎమ్మెల్యే సింహాద్రి
- పెదకమ్మవారిపాలెం, ఏటిమొగ గ్రామాల్లో పీఏసీఎస్ భవనాలు ప్రారంభం



ఏటిమొగలో నూతన భవనం ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించిన సింహాద్రి, తన్నీరు నాగేశ్వరరావు

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినూత్న ఆలోచనలతో పేదలకు విస్తృత ప్రయోజనాలు చేకూరడమే కాకుండా ఆయా వర్గాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయని కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. పెదకమ్మవారిపాలెం, ఏటిమొగ గ్రామాల్లో కేడీసీసీ బ్యాంక్ నిధులు రూ.51.5 లక్షల వ్యయంతో నిర్మించిన పీఏసీఎస్ నూతన భవనాలను గురువారం వారు ప్రారంభించారు. పెదకమ్మవారిపాలెంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు అధ్యక్షతన జరిగిన సభలో తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని 425 సొసైటీల్లో తాము వచ్చాక 200 సొసైటీలకు నూతన భవనాలు నిర్మించామన్నారు. అవసరమైన సహకార సంఘాల్లో గ్రామీణ ప్రజల సౌకర్యార్థం లాకర్లు ఏర్పాటు చేయాలనే యోచనలో ఉన్నామని చెప్పారు. గత టీడీపీ పాలనలో మాదిరి కాకుండా అనేక రకాల రుణాలను అందిస్తున్నామని, విదేశీ విద్యకు సైతం రూ.40 లక్షల వరకు రుణంగా ఇస్తున్నామని చెప్పారు. అవనిగడ్డ నియోజకవర్గంలో నాలుగేళ్లలో సహకార సొసైటీల ఆదాయం రూ.3 కోట్ల నుంచి రూ.15 కోట్లకు పెరిగిందన్నారు. రైతు భరోసాతో రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటోందని, రూ.18 వేల కోట్లు డ్వాక్రా రుణాలు మాఫీ చేశామని చెప్పారు.

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 37 సొసైటీలలో 19 సంఘాల విస్తృత అభివృద్ధికి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు సంపూర్ణ సహకారం అందించారని చెప్పారు. చంద్రబాబు మేనిఫెస్టో పేరుతో హంగామా చేసే కల్పిత టీజర్లు, సినిమాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గడిదేశి పెదవెంకయ్య, వైఎస్సార్ సీపీ రైతు విభాగం మూడు జిల్లాల జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, సర్పంచ్‌లు తలశిల అర్జునరావు, నాయుడు ఉమాదేవి, ఆరు పీఏసీఎస్‌ల అధ్యక్షులు తమ్ము సోమేశ్వరరావు, సింగోతు నాంచారయ్య, భోగాది నరసింహారావు, తోట సాయిబాబు, ముమ్మారెడ్డి సాంబశివరావు, కన్నా రామ్మోహన్‌రావు, స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు మద్ది చిన్నారి, బండ్రెడ్డి బాపిరెడ్డి, డీసీ మాజీ చైర్మన్ బీసాబత్తుని ప్రసాద్, సీఈఓలు కేవీ రామాంజనేయులు, గుర్రం వీర భాస్కర్, పార్టీ శ్రేణులు, సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొన్నారు.

వేకువ జాము నుంచే పింఛన్ల పంపిణీ



మచిలీపట్నం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిట్టెమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు గంగాభవాని

పెడన: వలంటీర్లు గురువారం తెల్లవారుజామున లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి తలుపుతట్టి సామాజిక పింఛన్లను అందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి సైతం వారి ఖర్చులకు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో స్వయంగా వెళ్లి వారికి అందజేశారు. పెడన పట్టణంలో 4,500 సామాజిక పింఛన్లకు గాను గురువారం ఒక్క రోజులోనే 3,735 మందికి అందజేశారు. రూ.1,25,47,000లకు గాను రూ.1,04,20,500 నగదును లబ్ధిదారులకు అందించారు. పెడన రూరల్ ప్రాంతంలో 5,603 మందికి గాను 4,219 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. రూ.1,52,21,500లకు గాను రూ.1,14,87,000 నగదును లబ్ధిదారులకు అందించారు. పెడన మండలం నందమూరు గ్రామానికి చెందిన తుమ్మా చిట్టెమ్మ(78) ఇటీవల అనారోగ్యానికి గురై రెండు రోజుల కిందట మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. వలంటీరు గంగాభవాని వెళ్లేసరికి ఆమెకు ఆస్పత్రిలో రక్తం ఎక్కిస్తున్నారు. దీంతో ఆమెకు వృద్ధాప్య పింఛను రూ.2,750లను అందించడంతో సంతోషం వ్యక్తం చేసింది.

మచిలీపట్నంలో 89.85 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ ఉత్సాహంగా సాగుతోంది. గురువారం అర్ధరాత్రి నుంచే వలంటీర్లు పింఛనుదారుల ఇళ్లకు వెళ్లి తలుపు తట్టి పింఛను సొమ్ము అందజేశారు. దీంతో పింఛనుదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ గురువారం సాయంత్రం ఆరు గంటల వరకు నగరంలోని 89.85 శాతం సాధించి జిల్లాలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. నగరంలో మొత్తం 18,515 మంది పింఛనుదారులు ఉండగా 16,639 మంది పింఛనుదారులకు సొమ్మును అందజేశారు. నగరానికి చెందిన పలువురు పింఛనుదారులు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారికి ఆయా డివిజన్ల వలంటీర్లు, గృహ సారథులు ఆస్పత్రికి వెళ్లి పింఛన్లను అందజేశారు.

85 శాతం పింఛన్ల పంపిణీ

గూడూరు: గూడూరు మండలంలో గురువారం కోడికూయక ముందే లబ్ధిదారుల గడపకు వెళ్లిన వలంటీర్లు సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. గూడూరు మండలంలో 8,198 పెన్షన్లు ఉండగా రాత్రి 8 గంటలకు 85 శాతం పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ డి.సుబ్బారావు తెలిపారు. ఆయా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి వలంటీర్లు లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు.



బందరు మూడో డివిజన్‌లో వృద్ధుడు యాకూబ్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ కె. హేమలత



రామన్నపేటలో పింఛను అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటప్పయ్య

అర్హత ఉన్న అందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- చల్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు, సంక్షేమ పథకాలు మంజూరు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం-4 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రమేష్‌బాబు పడమర వైపు నవర్ల ఎస్సీ కాలనీ, చేనేత కాలనీ, ఇస్లాం నగర్, బయటితోట ప్రాంతాల్లోని 458 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల ఆర్థిక ప్రగతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తున్నారని చెప్పారు. నిరుపేద కుటుంబాల్లోని పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్య అందుబాటులోకి తెచ్చి పేద విద్యార్థులు సైతం విదేశాల్లో చదువుకునే, ఉద్యోగాలు చేసేలా తీర్చిదిద్దుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలలను నాడు-నేడు కార్యక్రమం ద్వారా సమగ్రంగా అభివృద్ధి చేసి విద్య, వైద్యం అందుబాటులోకి తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు తుమ్మల వెంకటేశ్వరరావు, మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, సర్పంచ్‌లు వల్లూరు ఉమా, గొరిపర్తి సురేష్ బాబు, పీఏసీఎస్ చైర్మన్లు పాగోలు నాగ సీతారామారావు (ఫణి), అరజా శివశంకర్, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి కొండలు, నాయకులు బొందలపాటి లక్ష్మి, వెనిగళ్ల తారక జగదీష్, మోదుమూడి కుటుంబరావు, నర్రా కృష్ణ, కుందేటి కోటేశ్వరరావు, పిన్నిగంటి రవి, భిక్షం, బళ్ల లలితకుమారి, తహసీల్దార్ కె.గోపాలకృష్ణ, ఎంపీడీఓ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓటీఎస్ పట్టాలు పంపిణీ ...

జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం లబ్ధిదారులకు ఎమెల్యే సింహాద్రి రమేష్‌బాబు వన్ టైమ్ సెటిల్‌మెంట్ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి డాక్యుమెంట్లు అందజేశారు. గత ప్రభుత్వాలు పేదలకు మంజూరు చేసిన బీ-ఫారం పట్టాలకు బదులుగా లబ్ధిదారులకు వారి ప్లాట్‌పై శాశ్వత గృహ హక్కు కల్పించడంతో పాటు, గృహ నిర్మాణ రుణాన్ని కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్లియర్ చేస్తూ ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేశారని తెలిపారు.

కనుల పండువగా శత కలశ క్షీరాభిషేకం



ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేస్తున్న పండితులు

కోడూరు: భక్తుల హరి నామ స్మరణ మధ్య వెంకన్నకు అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. కోడూరు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించి తిరువారాధన, హోమాలను నిర్వహించారు. కోడూరుకు చెందిన సింగం పవన్ దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించగా, వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ అష్టోత్తర శత కలశ క్షీరాభిషేకం వైభవంగా జరిపారు. 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేసి, వాటిని ఆలయం చుట్టూ ఊరేగించి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లను కోడూరులోని ఇమ్మడి రాంబాబు ఇంటికి ఊరేగింపుగా తీసుకువెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి వంతెన సెంటర్‌లోని ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఎదుర్కోలు ఉత్సవాన్ని నిర్వహించారు. కోడూరు, ఇస్మాయిల్‌బేగ్ పేట, యర్రారెడ్డివారిపాలెం గ్రామాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం కొతుకోత్సవం, రాత్రికి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం స్వామి వారి మూలమూర్తులను శ్రీరంగనాథుడి అలంకారంలో తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. ప్రధాన అర్చకుడు దుంభాల శ్రీధరాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మార్మోగిన శివనామ స్మరణ

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి, శివలింగం, ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భాజా భజంత్రీలు, మేళతాళాలు, పూల పరిమళాలు, భక్తులు శివనామస్మరణ మధ్య సుబ్రహ్మణ్యస్వామి, శివలింగ ప్రతిష్ఠోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మండలంలోని పోటుమీద గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో గురువారం ఉదయం 8.12 గంటలకు గణపతి, సుబ్రహ్మణ్యస్వామి శిల, శివలింగం, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పది మంది రుత్వికులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ఠోత్సవాలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో పోటుమీద గ్రామం పులకించింది. ఆలయం మొత్తం వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. తొలుత ఆలయ శిఖర ప్రతిష్ఠను జరిపారు. యాగశాలలో మహా పూర్ణాహుతిని నిర్వహించారు. ప్రతిష్ఠోత్సవాల్లో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని స్వామివార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు రమేష్‌బాబును దుశ్శాలువాలతో సత్కరించారు. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్, తనయుడు మండలి వెంకట్రామ్ (రాజా)ప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొని, పూజలు చేశారు. గ్రామ ప్రముఖులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

పాఠశాలల పునఃప్రారంభం రోజే అందరికీ కిట్లు అందాలి



పెడన: పాఠశాలలు తెరిచిన రోజునే ప్రతి విద్యార్థి చేతిలో జగనన్న విద్యా కానుక కిట్లు తప్పనిసరిగా ఉండాలని జిల్లా ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కార్యాలయం మేనేజర్ ఏఎస్‌కే ఆంజనేయులు అన్నారు. గురువారం ఆయన పెడన ఎమ్మార్సీలోని జగనన్న విద్యా కానుక కిట్ల మండల స్టాక్ పాయింట్‌ను పరిశీలించి మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందించాలని చెప్పారు. పాఠశాలల పునఃప్రారంభానికి ముందే ఆయా పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లు చేరాలని సూచించారు. పాఠశాలలు తెరిచిన రోజునే అందరికి ఈ కిట్లు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. మండల వ్యాప్తంగా 69 పాఠశాలల్లో 4,570 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించాల్సి ఉందన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ అబ్దుల్ రహీం, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఎండీ రఫీవుల్లా, సీఆర్పీలు పాల్గొన్నారు.

పెడనలో సమగ్ర భూ సర్వే ప్రారంభం



డ్రోన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ అంజయ్య

పెడన: పట్టణంలో సమగ్ర భూ సర్వేకు సంబంధించి డ్రోన్ కెమేరాతో ఇమేజ్‌లు సేకరించే పనిని ప్రారంభించామని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య తెలిపారు. గురువారం స్థానిక గుడివాడ రోడ్డులోని దర్గా వద్ద డ్రోన్ కెమేరాను వినియోగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ముంబాయికి చెందిన డ్రోన్ ఏజెన్సీ ద్వారా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గురు, శుక్రవారాలలో మాత్రమే ఈ డ్రోన్‌ను వినియోగించి పట్టణానికి సంబంధించిన 1,287 హెక్టార్లలోని ఇళ్లు, ఖాళీ స్థలాలకు సంబంధించిన ఫొటోలు సేకరిస్తామన్నారు. ఈ ఇమేజ్‌లతో క్షేత్రస్థాయిలో సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు వెళ్లి పరిశీలించిన అనంతరం ఆయా ఇమేజ్‌లలోని కొలతలకు, క్షేత్రస్థాయిలోని ప్లానింగ్ కార్యదర్శులు తీసే కొలతలకు సమానంగా టాలీ కావాల్సి ఉంటుందన్నారు. ప్రజలకు బహుళ ప్రయోజనాలను కలిగించే వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా వీటిని సేకరిస్తున్నామని తెలిపారు. టీపీఓ ఏసుబాబు, ప్లానింగ్ కార్యదర్శులు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



నాగాయలంకలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

నాగాయలంక: సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై కళాకారుల బృందం గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో గుడివాడ కళాభారతికి చెందిన బిళ్లపాడు కళాకారులు శేఖర్‌బాబు, దేవప్రసాద్ నేతృత్వంలో బృందం సభ్యులు ఆటపాటలతో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై కళాజాతా నిర్వహించారు. సర్పంచ్ అంకాలు, ఉప సర్పంచ్ తలశిల నాని పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శి జరుగు పవన్ కళాకారులకు సహకరించారు.

- మోపిదేవి: ప్లాస్టిక్ కవర్ల వాడకం వలన కలిగే అనర్థాలను వివరిస్తూ కళాకారులు గురువారం కళాజాతా కార్యక్రమం నిర్వహించారు. మోపిదేవి పంచాయతీ కార్యాలయం వద్ద సాయంత్రం మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ అధికారి పర్యవేక్షణలో గుడివాడకు చెందిన కళాభారతి బిళ్లపాడు కళాకారులు శేఖర్‌బాబు, దేవప్రసాద్‌లు పర్యావరణ రక్షణకు మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

10న ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి(పెదకాకాని) సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన ఉచిత నేత్ర వైద్యశిబిరం ఏర్పాటు చేశామని సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంక కృష్ణానది తీరంలోని ఫుడ్ కోర్ట్ ఆవరణలో ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి కంటిలో శుక్లాలు ఉన్నవారికి శంకర కంటి ఆస్పత్రిలో ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 94906 36466, 70936 17778 నంబర్లను సంప్రదించవచ్చన్నారు.

పెరిగిన భూముల విలువ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో నగరంలోని ఆరు డివిజన్లు, రూరల్ ప్రాంతంలోని ఏడు గ్రామాల్లో భూముల విలువ గురువారం నుంచి పెరిగిందని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సీహెచ్ రజిత తెలిపారు. నగరంలోని రిజిస్ట్రార్ వార్డులైన 7, 9, 11, 13, 14, 24 (నగరంలో 32 వార్డులు ఉన్న సమయంలో) వార్డులతో పాటు గూడూరు, చిట్టిగూడూరు, కోకనారాయణపాలెం, రామరాజుపాలెం, తరకటూరు, మల్లవోలు, రాయవరం గ్రామాల్లోని భూముల విలువ పెరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం ఈ ప్రాంతాల్లోని భూముల విలువ 30 శాతం పెరిగిందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో పెరిగిన విలువకు కక్షిదారులు స్టాంప్ డ్యూటీ 7.5 శాతం చెల్లించాలన్నారు. గత రెండు రోజుల క్రితం సర్వర్ ఇబ్బందులు తలెత్తినా మే 31వ తేదీన సర్వర్ సక్రమంగా పనిచేయడంతో ఒకే రోజు 170 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేశామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో జగజ్జ్యోతి

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్ పేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో జగజ్జ్యోతి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భోగాది మస్తానరావు దంపతుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో చిన్నాపురానికి చెందిన బాల సరస్వతి నాట్య మండలి కళాకారులు బాలనాగమ్మ నాటకం నుంచి కార్యవర్ధి బాలనాగమ్మ సన్నివేశాలను ప్రదర్శించారు. తొలుత సువాసినులు లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ సమ్మెట ఆంజనేయస్వామి పర్యవేక్షించారు.

వైఎస్సార్ బీమా అందజేత



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామ శివారు కుమ్మరిపాలెంకు చెందిన నల్లూరి వెంకట రమణయ్య ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా మంజూరు కాగా తక్షణసాయంగా మట్టిఖర్చుల కింద రూ.10వేల నగదును మృతుని కుటుంబానికి గురువారం అందజేశారు. నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ చేతులమీదుగా మృతుడి కుమారుడు బాజీబాబుకు ఈ మొత్తాన్ని అందజేశారు. మిగిలిన బీమా సొమ్ము రూ.90 వేలను వారి ఖాతాకు జమ చేస్తారు. వలంటీర్ వెంకటలక్ష్మీ, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శివప్రసాద్, పెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠ

రామచంద్రపురం(అవనిగడ్డ): రామచంద్రపురంలో నూతనంగా నిర్మించిన లక్ష్మణ హనుమాన్ సమేత సీతారామచంద్రస్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ గురువారం వైభవంగా జరిగింది. త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజ జీయర్ స్వామి చేతుల మీదుగా ప్రతిష్ఠ కార్యక్రమం సాగింది. ఆలయ శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

మండలంలో 6, 974 మంది రైతులకు లబ్ధి

కోడూరు: వైఎస్సార్ రైతు భరోసా ద్వారా కోడూరు మండలంలో 6,974 మంది రైతులకు లబ్ధి చేకూరిందని ఏఓ భాను ప్రకాష్ గురువారం తెలిపారు. పథకం ద్వారా ఒక్కో రైతుకు రూ.5,500 చొప్పున 6,974 మంది రైతులకు రూ.3.83 కోట్ల నగదు నేరుగా ఖాతాల్లో జమ చేశారని చెప్పారు. వీటితో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా మండలంలో 614 మంది రైతులకు రూ.37.16 లక్షల నగదు ఖాతాల్లో జమ అయిందని ఏఓ వివరించారు.